# ఈ పెళ్లి జరగదు

-చిత్రపు ప్రశాంతి



సత్యమూర్తి కొత్తగా హోటల్ పెట్టాక నాగరాజు హోటల్‌కు వచ్చే కష్టమర్లు తగ్గుముఖం పట్టారు. కొత్తదనో, లేక క్వాలిటీ బాగుండటం వల్లో సత్యమూర్తి హోటల్ కష్టమర్లతో ప్రతిరోజూ కళకళలాడుతోంది. నాగరాజు హోటల్ ఆదాయం ఒక్కసారిగా వేల నుండి వందల్లోకి పడిపోయింది. ఈ అవమానం ఎంతమాత్రం భరించలేకపోయాడు అతడు. వారిమధ్య ఎలాంటి శత్రుత్వం లేదు, అలాగని వాళ్లు మిత్రులూ కారు. వ్యాపార పోటీలో వాళ్లిద్దరి మధ్య పెద్ద అగాథమే ఏర్పడింది. అది పెరిగి పెద్దదై, వాళ్లని బద్ధశత్రువులుగా మార్చింది.

ఒకరి వ్యాపారాన్ని ఒకరు దెబ్బకొట్టుకోడానికి వాళ్లు పాము, ముంగిసల్లా మారారు. తన వ్యాపారాన్ని దివాళా తీయించిన సత్యమూర్తిని సమయం చూసి ఘోరాతి ఘోరంగా దెబ్బతీయాలని కాచుకు కూర్చున్నాడు నాగరాజు.

ఇంతలో సత్యమూర్తి కూతురుకి పెళ్లి నిశ్చయమైంది. పెళ్లికొడుకు పేరు రాంబాబు. టీచర్ జాబ్ చేస్తున్నాడు. అతడు డబ్బుకి ఈజీగా అమ్ముడుపోయే మనిషి అని తెలిసిన నాగరాజు, సత్యమూర్తిని మానసికంగా దెబ్బకొట్టడానికి ఇదే తనకు మంచి అవకాశంగా భావించాడు. రాంబాబుని మర్యాదపూర్వకంగా కలిశాడు.

"సత్యమూర్తి కూతురు క్యారెక్టర్ మంచిది కాదు" అని చెప్పాడు. "పెళ్లిపీటల మీదనుండి తాళి కట్టకుండా నువ్వు లేచి వెళ్లిపోవాలి. ఈ పని నువ్వు చేస్తే, నేను నీకు అక్షరాలా లక్ష రూపాయలు ఇస్తాను" అని ఎర వేశాడు నాగరాజు. దీనివల్ల అతనికేమిటి లాభం అని రాంబాబు ఆలోచించలేదు. తనకు కావాల్సింది డబ్బు, అంతే!

సత్యమూర్తి ఇస్తానన్న కట్నం కంటే పాతిక వేలు ఎక్కువ ఇస్తామని ఇంకో పెళ్లివాళ్లు అన్నారని రెండురోజుల క్రితమే పెళ్లిళ్ల పేరయ్య ద్వారా తెలుసుకున్న రాంబాబు, ఈ సందర్భంగా నాగరాజు ఒప్పందానికి తలాడించాడు. రెండువైపుల నుంచీ అనుకోని ఆదాయం వస్తుండేసరికి తన నీచపుబుద్ధిని బయట పెట్టుకున్నాడు.

రాంబాబుకి నాగరాజు లక్ష రూపాయలు సమర్పించుకున్నాడు. కూతురి పెళ్లి పీటల మీద ఆగిపోతే, సత్యమూర్తి అవమానంగా ఫీలై రాత్రికి రాత్రే ఊరు వదిలి పారిపోయే సన్నివేశాన్ని ఊహించుకుంటూ వెళ్లిపోయాడు నాగరాజు.

కల్యాణ మండపంలో పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి దిగ్గున లేచిన రాంబాబు, "ఈ పెళ్లి జరగదు" అంటూ ఆమె క్యారెక్టర్ మంచిది కాదని నోటికొచ్చినట్టు వాగి, తాళి విసిరేసి, పీటల మీదనుంచి లేచి వెళ్లిపోయాడు.

అనుకోని అవాంతరానికి సత్యమూర్తి తల్లడిల్లిపోయాడు. పెళ్లికూతురు కన్నీళ్ల పర్యంతమైంది.

పెళ్లి ఆగిపోయిందని అనుకుంటూ పెళ్లికొచ్చిన వాళ్లంతా వెళ్లిపోతున్నారు. ఆ దృశ్యం చూడటానికే అక్కడికొచ్చిన నాగరాజు స్నేహితుడు సెల్‌ఫోన్ ద్వారా ఆ విషయాన్ని నాగరాజుకి తెలియచేశాడు.

నాగరాజుకి ఆనందం సునామీలా తన్నుకొచ్చింది. ఈ శుభవార్త తెలియచేసిన తన శ్రేయోభిలాషికి 'ఫోన్ కిస్' కూడా ఇచ్చేశాడు.

ఇలా వుండగా, ఆ పెళ్లి చూడటానికొచ్చిన దిలీప్ అనే ఓ యువకుడు, సత్యమూర్తి దగ్గరకు వచ్చి "మూర్తిగారూ! జరిగిందంతా ఓ పీడకల అని మర్చిపోండి. మీకూ మీ అమ్మాయికీ ఇష్టమైతే చెప్పండి, పైసా కట్నం తీసుకోకుండా ఇప్పుడే మీ అమ్మాయి మెళ్లో తాళి కడతాను" అన్నాడు.

అతడి మంచితనానికి పొంగిపోయిన సత్యమూర్తి మాటలు రాక, కృతజ్ఞతాభావంతో దిలీప్ కాళ్లకు దణ్ణం పెట్టాడు. డాక్టర్, పైగా అందగాడు తనకు భర్త కాబోతున్నందుకు చాలా సంతోషించింది సత్యమూర్తి కూతురు.

సత్యమూర్తి కూతురు పెళ్లి దాదాపు ఆగిపోయిందనుకుంటే, ఇంకా మంచి వరుడితో ఆమె పెళ్లి జరుగుతూండేసరికి ఆశ్చర్యంగా చూస్తున్న నాగరాజు స్నేహితుడు, మింగుడుపడని ఆ చేదుని జాన్ని నాగరాజుకి ఎలా చెప్పాలో తెలీక మన్ను తిన్న పాములా బయటకు నడిచాడు.

★